# అడుగడుగునా బ్రహ్మరథం



నల్లకుంటలో కాలేరు వెంకటేశ్‌కు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న బస్తీవాసులు

- **జోరుగా ప్రచారం**
- **బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్‌కు నీరాజనం పలుకుతున్న ప్రజలు**

అంబర్‌పేట/ కాచిగూడ, అక్టోబర్ 19: అంబర్‌పేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రచారం జోరుగా సాగుతోంది. బస్తీల్లో జనం బ్రహ్మరథం పడుతున్నారు. ప్రజలు ఎదురేగి బొట్టు పెట్టి.. హారతి పట్టి ఘనంగా స్వాగతం పలుకుతున్నారు. ఉదయం లేచింది మొదలు ప్రజాక్షేత్రంలోనే ఉంటున్నారు. ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటూ, వారికి భరోసానిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలోని నల్లకుంట సత్యానగర్‌లో డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని విన్నవించారు. సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి మహిళలు బయటకు వచ్చి కాలేరు కు బ్రహ్మరథం పట్టారు. హారతులిచ్చి ఆశీర్వదించారు. మీ వెంటే తామున్నామంటూ భరోసా ఇచ్చారు.



ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో
నూతనంగా ఏర్పాటైన కాలేరు యువ సైన్యం ప్రతినిధులు

**గడప గడపకూ కాలేరు యువ సైన్యం..**

అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గెలుపు కోసం ఎన్నికల ముగిసే వరకు ప్రచారం చేయడానికి నూతనంగా కాలేరు యువ సైన్యం ఏర్పాటైంది. బీఆర్ఎస్ నాయకుడు వెంకటరమణ రాజు అధ్యక్షతన ఈ సైన్యం ఏర్పాటైంది. గురువారం వీరంతా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను కలిశారు. తమ 30 మంది బృందం ఎన్నికల వరకు బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని ప్రతి బస్తీలో ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు ప్రచారం చేసి గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు. వెంకటరమణ రాజు అధ్యక్షునిగా ఉన్నా ఈ బృందంలో ఎం.శివకుమార్ గుప్త, భరద్వాజ్ విజయరాజు, సునీల్‌కుమార్, ఆకుల అరవింద్‌కుమార్, జహంగీర్ సూర్యవంశీ, సాయిరామరాజు, ఎడెల్లి శివకుమార్, మహమ్మద్ తాజ్ పాష, సతీష్‌ముదిరాజ్, కిశోర్, రాఘవేంద్రరాజు, నరహరి, జ్ఞానేశ్వర్, పసరకొండ కిశోర్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

**పొరుగు రాష్ట్రాల్లో లేని పథకాలు తెలంగాణలో అమలు..**

ఏ రాష్ట్రంలో ప్రవేశ పెట్టని పథకాలను సీఎం కేసీఆర్ తెలంగాణలో ప్రవేశపెడుతున్నాడని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. న్యూ ఇందిరానగర్ శ్రీసాయిగణేశ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా అర్హులైన 51 లక్షల మందికి తెలంగాణ ప్రభుత్వం పెన్షన్లను ఇస్తుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందు కెలుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కె.రవికుమార్, భోగస్వామి, పాక స్వామి, మేకల లక్ష్మీనారాయణ,చారి, అంబాదాస్, విజయ్, ముడారి శ్రీను, వినోద్‌చారి, రాకేశ్, నగేశ్, రాములు, కనకయ్య, రిషి తదితరులు పాల్గొన్నారు.

## సుధాకర్‌రెడ్డి ఆరోపణలు నిరాధారం..

అంబర్‌పేట, అక్టోబర్ 19 : డబ్బులు తీసుకొని బీఆర్ఎస్‌లో చేరానని ఎడ్ల సుధాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలు నిరాధారమైనవని బి.వెంకటరెడ్డి అన్నారు. ఆరోపణలు చేసిన వారు ముందుకు వస్తే ఏ గుళ్లోనైనా ప్రమాణం చేయడానికి సిద్ధమని సవాల్ విసిరారు. బాగ్‌అంబర్‌పేటలోని తన నివాసంలో కార్పొరేటర్ బి.పద్మతో కలిసి వెంకటరెడ్డి గురువారం మీడియాతో మాట్లాడారు. బీజేపీ పార్టీకి గత 40 ఏళ్లుగా సేవలందించానని, అంబర్‌పేట నుంచి పార్టీ టిక్కెట్ ఆశించానని, పార్టీ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మనస్థాపంలో పార్టీ మారాల్సి వచ్చిందని చెప్పారు. దీన్ని కొందరు డబ్బులు తీసుకొని పార్టీలోకి వచ్చాడని మాట్లాడటం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. ఏ పార్టీలో ఉన్నా పార్టీ కోసం పని చేసే మనస్తత్వం తమదని పేర్కొన్నారు. నేను ఎవరిని డబ్బులు అడగాల్సిన అవసరం లేదని, తన దగ్గర డబ్బులు ఉన్నందునే ఎమ్మెల్యే టిక్కెట్ అడిగానని స్పష్టం చేశారు. 1980 నుంచి తాను బీజేపీలో ఉన్నానని, అంబర్‌పేటలో పార్టీ పటిష్టతకు కృషి చేశానన్నారు. 2004లో అంబర్‌పేట కు వచ్చిన కిషన్‌రెడ్డి తమను కాదని టిక్కెట్ పొందారని తెలిపారు. ఓడిపోయే మలక్‌పేట అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చి ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చామని చెబుతున్నారని, అదే సీటులో కిషన్‌రెడ్డి పోటీ చేస్తే తెలిసేదన్నారు. ఓడిపోయే టిక్కెట్ ఇచ్చి ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చామని కిషన్‌రెడ్డి చెప్పడం తగదన్నారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో స్వతంత్ర అభ్యర్థికి మద్దతు పలికిన బీజేపీ నాయకులు కొందరు తనపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. తనకు ఎలాంటి డబ్బులు అవసరం లేదని, తన వ్యాపారాలు తనకు ఉన్నాయని, డబ్బుకు కొదవలేదని, ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేయడం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు.

## భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు



శ్రీమహాలక్ష్మి అలంకరణలో
జైస్వాల్ గార్డెన్ మైసమ్మ తల్లి



శ్రీలలిత త్రిపుర సుందరిదేవిగా
అంబర్‌పేట మహంకాళి అమ్మవారు

అంబర్‌పేట/గోల్నాక, అక్టోబర్ 19 : అంబర్‌పేట నియోజకవర్గం లో దసరాశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. నల్లకుం స్ట్రీట్ నంబర్-13లో చండీహోమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఈ హోమంలో పాల్గొన్నారు. అదే విధంగా అంబర్‌పేట మహంకాళి అ మ్మవారిని శ్రీలలితాత్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఇందులో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే బతుకమ్మకుంటలో గల శ్రీమైసమ్మ అమ్మవారు శ్రీధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. సేవా సమితి అధ్యక్షుడు కోట్ల శివకుమార్ భక్తులకు అన్ని ఏర్పాట్లు గావించారు. గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్‌లో గల శ్రీమైసమ్మ అమ్మవారిని శ్రీమహాలక్ష్మిదేవీగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు.

- దేవీశరన్నవరాత్రి ఉత్సావాల్లో భాగంగా గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్ శ్రీ మైసమ్మ ఆలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అందంగా ముస్తాబు చేసి పూజలు నిర్వహించారు. కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రమేశ్‌గౌడ్, ప్రసన్నాంజనేయులు, యాదవరెడ్డి, రామాగౌడ్, మధుసూదనచారి, స్వామిగౌడ్, పి.వెంకటేశ్, సత్యనారాయణ, దిలీప్‌గౌడ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా బతుకమ్మ వేడుకలు



బాగ్‌అంబర్‌పేట నందనవనం
కాలనీలో బతుకమ్మ ఆడుతున్న కాలనీ మహిళలు

అంబర్‌పేట, అక్టోబర్ 19: అంబర్‌పేట నియోజకవర్గంలో బతుకమ్మ వేడుకలు జోరుగా సాగుతున్నాయి. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో మహిళలు బతుకమ్మలను ఆడుతున్నారు. ఇందులో భాగంగా నల్లకుంట ఫీవర్ దవాఖానలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్, ఫీవర్ శాఖ ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఉద్యోగులంతా బతుకమ్మ ఆడారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో దవాఖాన సూపరింటెండెంట్ డా.కె.శంకర్, ఆర్ఎంవో డా.జయలక్ష్మి, డీసీఎస్ ఆర్ఎంవో చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్లు కొండల్‌రెడ్డి, హరిత, ఏవో మోహన్‌దాస్, ఆఫీస్ సూపరింటెండెంట్ యాదిలాల్, యూనియన్ దవాఖాన శాఖ అధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సతీష్, జనార్ధన్, కోశాధికారి శ్రీకాంత్, నాయకులు పద్మజ, సుజాత, గోపికృష్ణ, నజ్జు, రాఘవేందర్, శ్రీకాంత్, అబ్బాస్, మౌనిక, భాగ్యలక్ష్మి,భాగ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే బాగ్‌అంబర్‌పేట డివిజన్ నందనవనంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డి పాల్గొని బతుకమ్మ ఆడారు.



నల్లకుంట ఫీవర్ దవాఖానలో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు

## ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం



ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని తెలంగాణ స్విమ్మింగ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బర్కత్‌పురకు చెందిన గంధం క్వీన్ విక్టోరియా ఇటీవల ఈజిప్ట్‌లోని కైరోలో జరిగిన అంతర్జాతీయ అండర్ వాటర్ ఫిన్స్ స్విమ్మింగ్ 200, 400 మీటర్ల చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని బంగారు, రజిత పథకాలు సాధించింది. గురువారం చంద్రశేఖర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో గంధం క్వీన్ విక్టోరియా కలిసింది. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు. – కాచిగూడ, అక్టోబర్ 19

## డెలివరీ బాయ్‌పై దాడి.. వ్యక్తిపై కేసు నమోదు

కాచిగూడ,అక్టోబర్ 19 : తాగిన మైకంలో డెలివరీబాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. కాచిగూడ ఎస్సై డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేటకు షేక్ యూనిస్(25) ఫుడ్ డెలివరీబాయ్. బుధవారం రాత్రి రత్నానగర్ సమీపంలో ఫోన్ మాట్లాడుతుండగా అదే సమయంలో నాగోల్, జైపూర్‌కాలనీకి చెందిన గోపాల్(30) అతిగా మద్యం సేవించి రాయితో షేక్ యూనిస్‌ను కొట్టినట్లు తెలిపారు. దీంతో షేక్ యూనిస్ ఫిర్యాదు మేరకు గురువారం గోపాల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ,అక్టోబర్ 19: పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతానికి చెందిన ప్రకాశ్‌రావు కుమారుడు వెంకటి(30)గురువారం శివరాంపల్లి-బుద్వేల్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా అదే సమయంలో వచ్చిన రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.